క్లుప్తంగా

రైల్వేగేట్ వద్ద పనులతో అవస్థలు



దెందులూరు రైల్వే అండర్‌పాస్ వద్ద మోకాళ్ల లోతు నీటిలో వస్తున్న విద్యార్థులు

దెందులూరు: దెందులూరు రైల్వేగేటు వద్ద నిర్మిస్తున్న రైల్వే అండర్‌పాస్‌లో వర్షపునీరు ఆరు గ్రామాల ప్రజలు, విద్యార్థులు, వృద్ధులకు తీవ్ర అసౌకర్యంగా ఉంది. రైల్వే కాంట్రాక్టర్ తీవ్ర నిర్లక్ష్యం వల్లే వేలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేసవికాలంలో నిర్మించకుండా కోట్లాది రూపాయలు కాంట్రాక్ట్ తీసుకుని వర్షాకాలంలో ఎలా పని జరుగుతుందో? అని ప్రశ్నిస్తున్నారు. మోటారు పెట్టి నీళ్లు తోడించడానికి రైల్వే కాంట్రాక్టర్‌కు వచ్చిన ఇబ్బందేంటి? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

శివాలయంలో సింహద్వారం ఏర్పాటు



ద్వారం ఏర్పాటు పూజల్లో పాల్గొన్న జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీప్రసాదరావు

పెదపాడు: మండలంలోని సత్యవోలు గ్రామంలోని నూతనంగా నిర్మిస్తున్న శివాలయం సింహద్వారం ఆలయకమిటీ గురువారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ పాల్గొని ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన పూర్ణాహుతి, హోమ కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. అలాగే ఆలయ నిర్మాణానికి రూ.2లక్షల 11వేల నూట పదహారు విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో రంభ ఉమామహేశ్వరి, రెడ్డి స్వర్ణకుమారి, చేపేని రంగారావు పాల్గొన్నారు.

బువ్వనపల్లిలో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే



బువ్వనపల్లిలో గ్రామసచివాలయ ఉద్యోగులతో సర్వే సభ్యులు

నిడమర్రు: మండలంలోని బువ్వనపల్లిలో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా మూడు రోజులపాటు ఎన్ఎఫ్ఎహెచ్ఎస్ టీమ్ సభ్యులు గ్రామంలో పర్యటించి ఇంటింటికి తిరిగి జాతీయ ఆరోగ్య, బీమా కార్యక్రమాలు, రాష్ట్రం నుంచి ప్రజలకు అందిన ఆర్థిక లబ్ధి తదితర వివరాలు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. చేసుకున్నారు. ఆరోగ్య కార్యక్రమాల అమలు, ఆరోగ్య పథకాలపై ప్రజలకున్న అవగాహన నమోదు చేసుకుని నివేదిక తయారు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కిలారి సత్యవతి రవిబాబు, ఉప సర్పంచ్ వెల్లంకి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

ఏలూరు రూరల్: వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ శర్మిష్ట అన్నారు. గురువారం మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతి, మలేరియా ఇన్‌స్పెక్టర్ దుత్తి వేణుగోపాలస్వామి, మలేరియా సూపర్‌వైజర్ డి.దుర్గారావు, హెల్త్ అసిస్టెంట్, సిబ్బంది కొత్తగా బాధ్యతలు చేపట్టిన డీఎంహెచ్‌ఓను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శర్మిష్ట మాట్లాడుతూ నగరంలో మలేరియా ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల సహకారంతో సీజనల్ వ్యాధులను మరింత సమర్థవంతంగా అరికట్టవచ్చన్నారు. ఇందుకోసం చేపట్టిన చర్యలను అడిగి తెలుసుకున్నారు.

ఫిజియోథెరపీ ద్వారా మస్కులర్ డిస్ట్రోఫీ నివారణ

ఏలూరు రూరల్: ఫిజియోథెరపీ ద్వారా మస్కులర్ డిస్ట్రోఫీ వ్యాధిని నివారించవచ్చని డాక్టర్ తివిక్రమ్ మోహన్ అన్నారు. గురువారం వరల్డ్ మస్కులర్ డిస్ట్రోపీ డే సందర్భంగా జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జన్యుపరంగా సంక్రమించే మస్కులర్ డిస్ట్రోపీకి మందులు కనుగొనలేదని తివిక్రమ్ మోహన్ తెలిపారు. తల్లిదండ్రుల ద్వారా ఈ వ్యాధి సంక్రమిస్తుందన్నారు. దీనిపై అవగాహన పెంచుకుని ఫిజియోథెరపీ ద్వారా వ్యాధి నయం చేసుకోవచ్చని సూచించారు. దివ్యాంగుల పునరావాస కేంద్రం కో ఆర్డినేటర్ డి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులకు అందిస్తున్న కృత్రిమ అవయవాలు, ఫిజియోథెరపీ, ఆడియోలజీ, స్పీచ్‌థెరపీ తదితర సేవలు ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మణి పాల్గొన్నారు.

కృష్ణం వందే జగద్గురుమ్..!



పోతునూరులో జరిగే కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న నాయకులు



గుండుగొలనులో స్వామి వార్లను కోవెల ప్రదక్షిణలు చేయిస్తున్న దృశ్యం

- గ్రామాల్లో కృష్ణాష్టమి సందడి
- ఉట్టికొట్టడానికి పోటీపడిన యువత

దెందులూరు: పండుగలు, సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకలని కృష్ణాష్టమి వేడుకల్లో పోతునూరులో జెడ్పీ చైర్‌పర్సన్ హోదాలో తాను పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానని జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాద్ అన్నారు. గురువారం పోతునూరులో సర్పంచ్ బోదుల స్వరూప్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. తొలుత జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, జెడ్పీటీసీ సభ్యురాలు నిట్టా లీలానవకాంతం గంగరాజు తదితరులు రామాలయంలో స్వామివార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘ నేత తలారి రామకృష్ణ, బత్రాజు సత్యనారాయణ, పోతునూరు ఎంపీటీసీ సభ్యుడు సున్నా నరేష్ తదితరులు ఉన్నారు. పోతునూరు గ్రామానికి జెడ్పీ చైర్‌పర్సన్ హోదాలో తొలిసారిగా విచ్చేసిన గంటా పద్మశ్రీ ప్రసాద్‌లకు వైఎస్సార్ సీపీ నాయకులు, యాదవ సంఘ నాయకులు తలారి రామకృష్ణ, బత్రాజు సత్యనారాయణ, బీశెట్టి నూకరాజు, సున్నా నరేష్, బుద్దా అర్జున, రమేష్, గ్రామ సర్పంచ్ బోదుల స్వరూప్ ఘనంగా స్వాగతం పలికారు.



ఉప్పాకపాడులో కృష్ణుని ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

ఉప్పాకపాడులో కృష్ణుని ఊరేగింపు

ఉంగుటూరు: మండలంలోని ఉప్పాకపాడులో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక తాడేపల్లిగూడెం (ఉప్పాకపాడు కమిటీ) ఆధ్వర్యంలో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం గ్రామంలో వీధుల్లో గ్రామోత్సవం చేశారు. కార్యక్రమంలో ఎం.శ్రీనివాసులు, ఎం.లక్ష్మి, ఎం.కోటేశ్వరరావు, దుర్గాదేవి, ఎం.వేణు ఎం.ప్రశీణ పాల్గొన్నారు.

భీమడోలులో..

భీమడోలు: మండలంలోని గుండుగొలనులో ఉన్న శ్రీసీతారామస్వామి వారి ఆలయంలోని కృష్ణుని ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు గురువారం ఘనంగా చేశారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండా గంగరాజ్‌కుమార్ ఆధ్వర్యంలో అర్చకులు సుధీరాచార్యులు పర్యవేక్షణలో స్వామి వారికి విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామి వార్లు కోవెల ప్రదక్షిణలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. యువతులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఉట్టి కొట్టారు. విజేతలకు బహుమతులను అందించారు.

రీసర్వేతో సమస్యలకు శాశ్వత పరిష్కారం



కోడూరుపాడులో గ్రామకార్యదర్శులకు స్వమిత్వపై శిక్షణ అందిస్తున్న అధికారులు

భీమడోలు: జగనన్న శాశ్వత భూ హక్కు–భూరక్ష పథకం ద్వారా భూ సమస్యలు శాశ్వత పరిష్కారమవుతాయని ఏలూరు జిల్లా డివిజనల్ పంచాయతీ అధికారి పూర్ణచంద్రశేఖర్ అన్నారు. కోడూరుపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం జిల్లా శిక్షణ కేంద్రం నుంచి వచ్చిన సచివాలయ గ్రామ కార్యదర్శులకు రెండో విడత వైఎస్సార్ జగనన్న భూహక్కు, భూరక్ష పథకపు సర్వేపై వారికి శిక్షణ తరగతులను ప్రారంభించారు. గ్రామస్థాయిలో పర్యటనకు విచ్చేసిన గ్రామ కార్యదర్శులకు స్వమిత్వపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సర్పంచ్ మానుకొండ నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా డీఎల్‌పీవో పూర్ణ చంద్రశేఖర్, ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవిలు పాల్గొని వారికి అవగాహన కల్పించారు. గ్రామాల్లో దశాబ్దాలుగా ఉన్న భూ సమస్యలకు ఈ సర్వేతో చెక్ పడుతుందన్నారు. భూ తగదాలను పరిష్కరించి వారికి శాశ్వత పట్టాను అందించడం ద్వారా వారికి మేలు జరుగుతుందన్నారు. జిల్లాలోనే కోడూరుపాడులో పూర్తి స్థాయి సర్వే పూర్తి అయ్యిందన్నారు. గ్రామాల్లోని ప్రజలకు ఈ విధానంపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత కార్యదర్శులపై ఉందన్నారు. తొలుత గ్రామ కార్యదర్శి వెజ్జు ధర్మా సర్వేపై శిక్షణ అందించారు. వారి అనుమానాలను నివృత్తి చేసారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ ఎం.ముత్తయ్య, జిల్లాలోని గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో జీవితాలు నాశనం



భీమడోలులో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న పీఓ కేవీ విజయలక్ష్మి

భీమడోలు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని మాతా శిశు సంక్షేమ శాఖ భీమడోలు పీఓ కేవీ విజయలక్ష్మి అన్నారు. భీమడోలు ఉన్నత పాఠశాలలో ని 9, 10వ తరగతుల విద్యార్థినులకు గురువారం బాలల హక్కులు, చట్టాలు, సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. దిశా వన్ స్టాప్ కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలపై వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హెచ్ఎం బి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా హాజరైన పీఓ కేవీ విజయలక్ష్మీ మాట్లాడారు. బేటి బచావో బేటి పడావో నినాదం ప్రతి ఇంటికి చేరాలన్నారు. బాల్య వివాహాల నిషేధ చట్టం ప్రకారం వివాహ వయస్సు యువతులకు 18 ఏళ్లు, యువకులకు 21 వయస్సు అన్నారు. గ్రామాల్లో బాలల హక్కుల కమిటి సభ్యులు బాల్య వివాహాలపై ప్రత్యేక నిఘా ఉంచి వాటిని అరికట్టేందుకు తమ వంతు కృషి చేయాలన్నారు. ఎవరైనా బాలలు ఆపదలో ఉన్నట్లయితే 1098కు సమాచారం అందించాలని, తక్షణమే వారికి పోలీసులు ద్వారా రక్షణ లభిస్తుందన్నారు. బాలల హక్కులు, చట్టాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎండీ షాహనాజ్‌బేగం, చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ వైవీ రాజు, డీసీపీయూ సోషల్‌వర్కర్ శ్రీకాంత్, దిశా వన్‌స్టాప్ సెంటర్ కేసు సిబ్బంది త్రివేణి, అనిత తదితరులు పాల్గొన్నారు.

నేడు పీడీ, పీఈటీల సమావేశం

దెందులూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు మండలంలోని అన్ని పాఠశాలల్లో పని చేస్తున్న ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ ఎవీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల స్థాయి క్రీడల నిర్వహణ, యాక్షన్‌ప్లాన్ అమలు చేసేందుకు సమావేశం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సమావేశానికి విధిగా పీడీ, పీఈటీలంతా హాజరుకావాలని కోరారు.

వర్షంతో రైతుల మోముల్లో ఆనందం



ఉత్సాహంగా పొలంలో మందులు జల్లుతున్న రైతు

పెదవేగి: గత కొద్ది రోజులుగా కురిసిన వర్షానికి అన్నదాతల మోములో చిరునవ్వు వెల్లువిరిసేలా చేసింది. ఈ సంవత్సరం సరైన వర్షపాతం లేవనుకున్న సమయంలో ఊహించని రీతిలో మంచి వర్షాలు పడడంతో వేసిన పంటలపై రైతులకు అంచనాలు పెరిగాయి. ఈ మధ్యకాలం కురిసిన భారీ వర్షంతో పంటలకు జీవం వచ్చింది. మండలంలో వర్షాలు మరిన్ని రోజులు కొనసాగితే చెరువులు నిండి రెండో పంటకు కూడా సాగునీరు ఉంటుందని రైతులు చెబుతున్నారు.

మరో కొన్ని రోజులు కురవాలి..

మండలంలో రెండు వేల 475 హెక్టార్ల ఖరీఫ్ విస్తీర్ణం కాగా, దాదాపు పంట మొత్తం పిలకల దశలో ఉంది. పొలాలకు నత్రజనితో కూడిన ఈ వర్షం నూతన నిగారింపును తెచ్చిపెడుతుందని వ్యవసాయధికారి ప్రియాంక తెలిపారు. మరికొన్ని రోజులు వర్షాలు పడితే పంటలకు మరింత మేలు జరుగుతుందని రైతులు చెబుతున్నారు.

దాతల సహకారం అభినందనీయం



బువ్వనపల్లి గ్రామ దేవత వడలమ్మ ఆలయం వద్ద భూమి పూజలు చేస్తున్న పుప్పాల కన్నబాబు

నిడమర్రు: ఆలయాల అభివృద్ధిలో దాతల సహకారం అభినందనీయమని వైఎస్సార్ సీపీ మండల బాధ్యులు పుప్పాల కన్నబాబు అన్నారు. గురువారం బువ్వనపల్లి గ్రామ దేవత శ్రీవడలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో రూ.10 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ఐరన్ షెడ్ శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ మొత్తం ఖర్చును ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ సంకు పులయ్య భరిస్తారని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న కన్నబాబు మాట్లాడుతూ ఇప్పటికే గ్రామంలో దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్న దాత సంకు పుల్లయ్య సేవలను కొనియాడారు. ఈ భూమి పూజలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, గ్రామ పార్టీ అధ్యక్షుడు కాన్వెంట్ శ్రీను, ఉప సర్పంచ్ వెల్లంకి నరేష్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తోపు సూర్యచంద్రరావు, కోసూరి శ్రీను, వలుపు జగదీష్, సంకు పండు, పులమంతుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే అభివృద్ధి



వేళంగిణి మాత ఉత్సవాల్లో మాట్లాడుతున్న సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్

దెందులూరు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన, దేవుని పట్ల భయభక్తులు కలిగి ఉండాలని తద్వారానే అభివృద్ధి, దేవుని దీవెనలు లభిస్తాయని గోపన్నపాలెం సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్ అన్నారు. గురువారం వేగవరంలో స్థానిక ఆర్‌సీఎం చర్చి ఫాదర్ జీ.మోజెస్ ఆధ్వర్యంలో కొత్తపల్లి గ్రామస్తులు, ఆర్‌సీఎం సంఘస్తులు సహకారంతో వేళంగిణి మాత ఉత్సవాలు నిర్వహించారు. తొలుత ఫాదర్ మోజెస్, ఫాదర్ థామస్, ఫాదర్ తంబి ప్రత్యేక ప్రార్థులు, దివ్యపూజాబలి అర్పించారు. వేళంగిణి మాత ఉత్సవాలు 7వ రోజు ఘనంగా నిర్వహించడానికి నిర్వాహకులు కొత్తపల్లి గ్రామ సంఘానికి ఫాదర్లు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అతిథిగా విచ్చేసిన గ్రామ సర్పంచ్ మల్లేశ్వరిని ఫాదర్లు సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

ఉత్తమ ఉపాధ్యాయుల సేవలు ప్రశంసనీయం



అన్నేవారిగూడెంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మస్తాన్ దంపతులను సత్కరిస్తున్న నాయకులు

భీమడోలు: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎస్‌కే మస్తాన్ సేవలు ప్రశంసనీయమని దుద్దేపూడి పంచాయతీ సర్పంచ్ నీలం శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు పాల్నాటి శ్రీనివాస్‌లు అన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని దుద్దేపూడి పంచాయతీ శివారు అన్నేవారిగూడెం ప్రీ హైస్కూలు హెచ్ఎం ఎస్‌కే మస్తాన్ జిల్లా ఉత్తమ అవార్డును, అదే పాఠశాలకు చెందిన దుర్గాప్రసాదిని మండల స్థాయి అవార్డులను అందుకున్నారు. ఈ నేపథ్యంలో గురువారం పాఠశాలలో వారికి పౌరసన్మానం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నీలం శ్రీనివాసరావు, ఎంపీటీసీ పాల్నాటి శ్రీనివాసరావులు మాట్లాడుతూ అవార్డులు మరింత బాధ్యతను పెంచుతాయన్నారు. ఈ తరుణంలో చిన్నారులు తమకు ఇష్టమైన టీచర్ అనుకరిస్తూ పాఠాలను వల్లించి చూపరులను ఆకట్టుకున్నారు. అనంతరం అవార్డు గ్రహీతలతో పాటు ఉపాధ్యాయులకు దుశ్శాలువాలను కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీచర్లు స్వర్ణలత, విజయకుమారి, జ్యోతిబసు, ఝాన్సీ, శారరాణి, రవికుమార్, సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటలక్ష్మికి ఘన సత్కారం



దెందులూరులో వి.వెంకటలక్ష్మిని సత్కరిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

దెందులూరు: దెందులూరు మండల ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు గ్రహీత వి.వెంకటలక్ష్మి బోధనా సామర్థ్యం, సమన్వయం, ప్రణాళిక, అభినందనీయమని దెందులూరు ఎంఈఓలు ఎవీఎస్‌వీ ప్రసాద్, అన్నమ్మ అన్నారు. గురువారం దెందులూరు ప్రాథమిక పాఠశాల–1 హెచ్ఎం వీ.వెంకటలక్ష్మిని ఎంఈఓలు, ఉపాధ్యాయులు లక్ష్మీభాయి, శ్యామ్‌ప్రసాద్, ఎండీఎం, పేరెంట్స్ కమిటీ సభ్యులు శాలువా, పూలదండలు, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు.

అభివృద్ధిపై అసత్య ప్రచారం తగదు



ఎంపీపీ శ్రీనివాసరాజుకు సమస్యలు వివరిస్తున్న నాయకులు

ఏలూరు రూరల్: ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై ఎల్లో మీడియా చేస్తోన్న అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలని ఏలూరు ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు అన్నారు. గురువారం చాటపర్రు సర్పంచ్ గుడిపూడి రఘు, పెదయాగనమిల్లి సర్పంచ్ బలే నాగసులోచన, వడ్డీ కార్పొరేషన్ డైరెక్టర్ మండల కొండలరావు, వైఎస్సార్ సీపీ శ్రీపర్రు నాయకుడు సైదు వజ్రం, పీఆర్ ఏఈ కృష్ణమోహన్, ఎంఈఓ–2 ఆర్ రంగయ్య తదితరులు మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీని కలిశారు. అభివృద్ధి పనులు, పలు సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రఘు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసి చాటపర్రులో ఓవర్‌హెడ్ ట్యాంక్, ఇంటింటికీ కుళాయి, పైప్‌లైన్, సీసీ రోడ్లు, డ్రెయినేజీ తదితర అభివృద్ధి పనులు చేసినప్పటికీ పలు పత్రికల్లో గోతులమయమైన రోడ్డు చూపుతూ కథనాలు ప్రచరిస్తున్నాయని వాపోయారు. ఎంపీపీ స్పందిస్తూ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషితో గ్రామాల్లో సీసీ రోడ్లు అభివృద్ధికి ప్రభుత్వం రూ.4 కోట్లు రూర్బన్ నిధులు విడుదల చేసిందన్నారు. ఇందులో చాటపర్రులో రూ.75 లక్షలతో 9 సీసీ రోడ్లు అభివృద్ధి చేస్తారని తెలిపారు. టెండర్లు ఖరారయ్యాయని త్వరలో పనులు ప్రారంభిస్తామని ఏఈ కృష్ణమోహన్ చెప్పారు. స్థానిక జెడ్పీ పాఠశాల తరగతి గదులు నిర్మాణ పనులు వేగవంతం చేస్తానని ఎంఈఓ రంగయ్య తెలిపారు. శ్రీపర్రు, పెదయాగనమిల్లి భూ సమస్య పరిష్కరించేందుకు సహకరించాలని శ్రీపర్రు పెద్దలు ఎంపీపీని కోరారు.

బాధితులకు న్యాయం చేశాకే నిర్మాణాలు



క్యాంపు కార్యాలయంలో బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని



సమావేశానికి హాజరైన ప్రజలు

ఏలూరు టౌన్: ఏలూరు నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నామని, ప్రజల సహకారం అవసరమని, బాధితులకు న్యాయం చేశాకే నిర్మాణ పనులు చేపడతామని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ఏలూరు మార్కెట్ యార్డ్ సమీపంలో రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ బ్రిడ్జి నిర్మాణానికి భూసేకరణలో ఇళ్లు కోల్పోతున్న పలువురితో ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నాని గురువారం ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. 50వ డివిజన్‌కు చెందిన సుమారు 80 కుటుంబాల ప్రజలను ఏఎంసీ మాజీ చైర్మన్, పార్టీ జిల్లా కోశాధికారి మంచెం మైబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నానిని కలిశారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ఏలూరు నగరంలో పెరుగుతోన్న జనాభా అవసరాలకు అనుగుణంగా రోడ్డు విస్తరణ, ఫ్లై ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. మార్కెట్ యార్డ్ సమీపంలో రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో నగర ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఎమ్మెల్యే చెప్పారు. నగరంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణంతో ఇళ్లు కోల్పోతున్న బాధితులకు సమీపంలోనే స్థలాలు కేటాయింపుతోపాటు ఇళ్ల నిర్మాణానికి రుణాలు మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే నాని హామీ ఇచ్చారు. బాధితులకు న్యాయం చేసేందుకు అందుబాటులోని స్థలాల వివరాలు సేకరించాలని అధికారులను ఆదేశించారు. నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేసాకే వంతెన నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే నాని తెలిపారు. సమావేశంలో ఏలూరు డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్ బాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, మాజీ కార్పొరేటర్ బండారు కిరణ్, తదితరులు ఉన్నారు.